సాక్షి తిరుపతి

గురువారం। 13। మార్చి। 2025



ప్రజలతోనే 'పదిహేనేళ్లు'

తిరుపతిలో బుధవారం ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ జెండా ఎగురవేశారు. - 8లో



డామిట్.. కథ అడ్డం తిరిగింది!

చిత్తూరు నగరంలో బుధవారం ఉదయం ఓ ఇంట్లో దోపిడీకి కొందరు దుండగులు విఫల యత్నం చేశారు. - 8లో

రంజాన్ వేళలు	ఇఫ్తార్ గురువారం (సా)	సహర్ శుక్రవారం (ఉ)
తిరుపతి	6-26	5-02
గూడూరు	6-20	4-59



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న భూమన కరుణాకరరెడ్డి, అభినయ్ తదితరులు



యువత పోరుకు భారీగా తరలివచ్చిన విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నిర్వేదం.. నిప్పు కణమై!

కూటమి ప్రభుత్వం కరుణిస్తుందేమో అని పేద విద్యార్థులు ఆశపడ్డారు.. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేరుస్తారేమో అని పడిగాపులు కాశారు.. చదువుకు ఆటంకం కలగకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తారేమో అని గత 9 నెలలుగా ఎదురుచూశారు.. సర్కారు నిర్లక్ష్య వైఖరితో విసిగి వేశారిపోయారు.. ఆవేదనతో నలిగిపోయారు. ఆగ్రహంతో రగిలిపోయారు.. ఈ క్రమంలో తల్లడిల్లిన నిరుపేద విద్యార్థుల గుండె మండింది. వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు బుధవారం నిర్వహించిన యువత పోరుకు పోటెత్తింది. జగనన్న పాలనలో సజావుగా అందిన విద్యాదీవెనను గుర్తుచేసుకుంది. భూమన నేతృత్వంలో కదంతొక్కింది. కలెక్టరేట్‌ను ముట్టడించి ఆందోళనకు దిగింది. ప్రజా విద్రోహ పాలనకు వ్యతిరేకంగా నినదించింది.

- వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'కు పోటెత్తిన విద్యార్థులు
- ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించాలని నినాదాలు
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం
- సీఎం చంద్రబాబు దగా చేశారంటూ ఆక్రోశం

తిరుపతి అర్బన్/తిరుపతి మంగళం : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద చేపట్టిన యువత పోరు విజయవంతమైంది. పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సీఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలోనే పోలీసుల ఓవర్‌యాక్షన్‌పై మండిపడ్డారు. నిరసనకారులను నిర్దాక్షిణ్యంగా నెట్టేయడంపై ఆవేదన చెందారు. ఉద్రిక్త వాతావరణంలోనే భూమన నేతృత్వంలో పలువురు నేతలు కలెక్టరేట్‌లోకి వెళ్లి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. పేద విద్యార్థుల ఫీజులు చెల్లించకుండా



కలెక్టరేట్ గేటు వద్ద విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసుల బలగాలు

ప్రభుత్వం దగా చేస్తోందని, ఇప్పటికైనా ఫీజు బకాయిలు జమ చేయాలని పేర్కొన్నారు.

అన్నివర్గాలకు అన్యాయం

భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. పేద ప్రజలను నిలువునా మోసం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు దురాలోచనతో నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పారన్నారు. సూపర్‌సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టి ఒక్కటి కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. చివరకు విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సైతం చెల్లించని ప్రజాద్రోహి చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలలకు ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులను ఆయా యాజమాన్యాలు బయటకు పంపేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ బిడ్డల భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారంలోకి రాగానే ఇస్తానన్న రూ. 3వేలు నిరుద్యోగ భృతి, 20లక్షల ఉద్యోగాల సంగతి ఏమైందని ప్రశ్నించారు. జగనన్న ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి పేదల బతుకుల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడని కొనియాడారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను అందించిన దేవుడని వెల్లడించారు. సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ అందిస్తూ విద్యార్థుల ఉన్నత భవితకు కృషి చేశారని వివరించారు. పేద పిల్లలు సైతం వైద్యులుగా ఎదగాలని రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిన దార్శనికుడు జగనన్న అని కొనియాడారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చంద్రబాబు వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించకుండా కేవలం వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధించేందుకే చంద్రబాబు ప్రాధాన్యమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అందుకే ప్రజల్లో సైతం ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోందని వివరించారు.

అడుగు అడుగు కదలి..

యువత పోరు కార్యక్రమానికి పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు. భూమన కరుణాకరరెడ్డితోపాటు మేయర్ శిరీష, పార్టీ తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్, తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవి చంద్రారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, యువత విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, యువజన విభాగం నగర అధ్యక్షుడు దినేష్‌రాయల్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు గీతాయాదవ్, జిల్లా మహిళా అధ్యక్షులు మాధవిరెడ్డి, నేతలు, కార్యకర్తలు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మరోవైపు భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చారు. ఈ క్రమంలోనే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కలెక్టరేట్‌కు చేరుకుని వైఎస్సార్‌సీపీ ఆందోళనకు సంఘీభావం తెలిపారు.



విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, విద్యార్థుల ర్యాలీ



ఆందోళనకారులపై దాడుకి దిగుతున్న పోలీసులు



భూమన నేతృత్వంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

న్యూస్‌రీల్

ఆల్జీబ్రాపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : గణితశాస్త్రంలో ఆల్జీబ్రా, ఆల్జీబ్రాయిక్ కీలకమని వాటిపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. వర్సిటీ సైన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆల్జీబ్రా, ఆల్జీబ్రాయిక్ నంబర్ థియరీ, ట్రోపాలజీ వాటి ఆవర్తనాలు అనే అంశంపై శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ గణితశాస్త్రంలో కీలకమైన, క్లిష్టమైన అంశాలపై విద్యార్థులకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని తరగతులు నిర్వహించేందుకు వర్సిటీ ప్రోత్సాహం అందిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మావతి, ఐజర్ ప్రొఫెసర్ డీఎస్ నాగరాజా, గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ సి.జయసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

15 నుంచి ఈఏపీసెట్‌కు దరఖాస్తులు

తిరుపతి సిటీ : ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ యూజీ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్–2025 (గతంలో ఎంసెట్)కు ఈనెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 24వ తేదీని దరఖాస్తులకు చివరి గడువుగా పేర్కొన్నారు. మే 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ, 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు.

అతివల పాత్ర అమోఘం

సూళ్లూరుపేట : సమాజంలోని అన్ని రంగాల్లో అతివల పాత్ర అమోఘమని, ప్రధానంగా అంతరిక్ష ప్రయోగాల్లోనూ కీలకభూమిక పోషిస్తున్నారని కోయంబత్తూరుకు చెందిన డాక్టర్ భారతీ హరిశంకర్ తెలిపారు. బుధవారం షార్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ రాజరాజన్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో భారతీ హరిశంకర్ మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితమైన రోజుల నుంచి అంతరిక్షంలోకి వెళ్లే స్థాయికి చేరుకోవడం అభినందనయమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.



జ్యోతి ప్రజ్వలనలో భారతీ హరిశంకర్ తదితరులు

ఈ సందర్భంగా షార్ ఉద్యోగులు వందమంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్‌ఏ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

తిరుపతిలో పైపులైన్‌కు టీటీడీ నిధులు

సాక్షి, అమరావతి : తిరుపతి నగర పరిధిలోని ఎండీ పుత్తూరు, మంగళం పంపింగ్ స్టేషన్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పైపులైన్ నిర్మాణ పనులకు రూ.9కోట్లను టీటీడీ అందించనుంది. బుధవారం ఈ మేరకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. 2024 డిసెంబరు 24 టీటీడీ బోర్డులో చేసిన తీర్మానానికి అనుగుణంగా అనుమతులిస్తున్నట్టు దేవదాయ శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'ఓటేరు' పరిరక్షణే లక్ష్యం

తిరుపతి రూరల్ : కబ్జా కోరల నుంచి ఓటేరు చెరువు పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. బుధవారం ఓటేరు చెరువును పరిశీలించారు. నారాయణ మాట్లాడుతూ చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకుడు గుంతలకు ప్రాధాన్యత అంటారని, చెరువులు పూడ్చేస్తుంటే చూస్తూ ఉంటారని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు గుజ్జుల ఈశ్వరయ్య, రామానాయుడు, పి.మురళి, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, జె.విశ్వనాథ్, బి.నదియా, కత్తి రవి, కె.శివారెడ్డి, కె.పద్మనాభ రెడ్డి, హేమలత, జయచంద్ర, వేణు బుజ్జమ్మ, పి.అంజయ్య పాల్గొన్నారు.



ఓటేరు చెరువును పరిశీలిస్తున్న నారాయణ

పోరాటమే నిత్యకృత్యం

తిరుపతి కల్చరల్ : జాస్వామ్యం పరిరక్షణలో భాగంగా పోరాటమే నిత్యకృత్యమని నారాయణ తెలిపారు. సాయినగర్‌లోని వైన్‌షాపు మార్పునకు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడంపై సీపీఐ ఆధ్వర్యంలో పది రోజులుగా నిరసన చేపట్టామన్నారు. ఈ మేరకు విజయం సాధించినట్లు వెల్లడించారు. నేతలు జి.ఈశ్వరయ్య , రామానాయుడు, పి.మురళి, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, కె.శివారెడ్డి పాల్గొన్నారు.

గడువులోపు ఇల్లు కడితే బోనస్



వెంకటేశ్వర్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–1 పథకంలో భాగంగా ఏప్రిల్ 30వ తేదీ లోపు ఇల్లు నిర్మించుకుంటే ఇప్పటికే అందిస్తున్న రూ.1.80 లక్షలతోపాటు అదనపు నగదు అందించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గడువులోపు ఇల్లు కట్టుకుంటే ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75 వేలు మంజూరు చేస్తామని వెల్లడించారు. అయితే గత ఏడాది డిసెంబర్ 10వ తేదీ నాటికి ఇంటి నిర్మాణాలు ప్రారంభించిన వారు మాత్రమే అర్హులని వివరించారు. ఈ మేరకు లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు సర్వే చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ మాత్రమే నిండింది. బుధవారం అర్ధరాత్రి వరకు 66,393 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 19,490 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.86 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

శ్రీసిటీలో ఏపీఐఐసీ చైర్మన్



అధికారులతో సమీక్షిస్తున్న ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీని బుధవారం ఏపీఐఐసీ చైర్మన్ ఎం.రామరాజు సందర్శించారు. శ్రీసిటీ డైరెక్టర్ ముకుంద రెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. అనంతరం శ్రీసిటీ పరిసరాలలో పర్యటించి పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. రామరాజు పర్యటనను తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ భరత్ రెడ్డి పాల్గొన్నారు.

గుణాత్మక విద్య తప్పనిసరి

ఏర్పేడు(రేణిగుంట) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తప్పనిసరిగా గుణాత్మక విద్యను అందించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ కేవీఎం కుమార్ ఆదేశించారు. బుధవారం ఏర్పేడు, పంగూరు కాంప్లెక్స్ సమావేశాలను ఆయన తనిఖీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అమలు చేయాల్సిన విద్యా ప్రణాళికలను వివరించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, ఎంఈఓలు ప్రేమలత, దయాకర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో డీఈఓ కేవీఎం కుమార్

క్లుప్తంగా

చిత్తశుద్ధి లేని ప్రభుత్వం


రమేష్

నారాయణవనం: ప్రభుత్వ వైద్యశాలల్లోని ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ల్యాబ్ టెక్నీషియన్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్ ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రోగికి వైద్య సేవలు అందాలంటే రోగ నిర్ధారణ చేస్తున్న టెక్నీషియన్ల పాత్ర కీలకమని తెలిపారు. గ్రేడ్-2 క్యాడర్‌లోనే ఉద్యోగంలో చేరి, అదే క్యాడర్‌లో విరమణ చెందే దౌర్భాగ్యం తమదేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్లు, జోనల్ క్యాడర్‌గా మార్పు, పీహెచ్‌సీలలో 2వ ల్యాబ్ టెక్నీషియన్ పోస్ట్ మంజూరు, ల్యాబ్‌ల ఆధునీకరణ, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితర ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ఇంటర్ పరీక్షకు 598 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ పరీక్షలకు బుధవారం జిల్లా వ్యాప్తంగా 598 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 86 కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించారు. జనరల్‌లో 28,599మంది, ఒకేషనల్‌లో 1,040మంది మొత్తం 29,639మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 29,041మంది మాత్రమే పరీక్ష రాసినట్లు ఆర్‌ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఫస్టియర్ విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రజలతోనే పదిహేనేళ్లు


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

- జనరంజకంగా వైఎస్ జగన్ పాలన
- పేదలను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో పెద్దిరెడ్డి, భూమన

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ గత పదిహేనేళ్లుగా ప్రజలతో మమేకమై ముందుకు సాగుతోందని పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతి మారుతీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లపాటు జనరంజకంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. ఇచ్చిన హామీల కంటే ఎక్కువ అందించి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. నిరుపేద విద్యార్థులు సైతం ఉన్నతంగా చదువుకోవాలనే సంకల్పంతో మహానేత వైఎస్సార్ ఫీజురీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టారని తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిగా జగన్‌మోహన్‌రెడ్డి సైతం మహోన్నత పథకానికి మరింత మెరుగులు దిద్ది పకడ్బందీగా కొనసాగించారని వెల్లడించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో నోటికి వచ్చిన అబద్ధాలు చెప్పిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటి కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. పేద విద్యార్థుల బతుకులతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాలను నిర్వీర్యం చేస్తూ ఆడపడుచులను మోసం చేశారని ఆరోపించారు. ప్రజలను గాలికి వదిలేసి, వైఎస్సార్‌సీపీ నేతలను జైలులో పెట్టడమే పనిగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోర్టులోనే తేల్చుకుంటాం...

మంగళంపేటలో అటవీ భూములను ఆక్రమించుకున్నానంటూ ఈనాడు పత్రిక పనికట్టుకుని తప్పుడు వార్తలు రాస్తోందని పెద్దిరెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్ ఆకాంక్షలకు అనుగుణంగా తనను టార్గెట్ చేసి అసత్య కథనాలను వండి వారుస్తోందన్నారు. దీనిపై కోర్టులోనే తేల్చుకుంటానని స్పష్టం చేశారు.

పేదల కోసమే పుట్టింది

పేద ప్రజల అభ్యున్నతి కోసమే వైఎస్సార్‌సీపీ పుట్టిందని పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి పద్మావతిపురంలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు పంచిపెట్టారు. భూమన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ 14 వసంతాలు పూర్తి చేసుకుని 15వ ఏట అడుగుపెడుతోందన్నారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజాసంక్షేమం కోసం శ్రమిస్తున్నారని వెల్లడించారు. జగనన్న పాలనను ఆదర్శంగా తీసుకుని పలు రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లోనే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుందని విమర్శించారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, పార్టీ తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్తలు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్, తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, ఉదయ్‌వంశీ, దినేష్‌రాయల్, పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు గీతాయాదవ్, జిల్లా మహిళా అధ్యక్షులు మాధవిరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగం పేరుతో టోకరా

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని నిరుద్యోగులకు ఆశ చూపి వారి వద్ద నుంచి రూ.కోట్లు కాజేసిన ఘరానా మోసగాడి ఉదంతం బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ క్రమంలో బాధితులు ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. వివరాలు.. రేణిగుంట మండలం ఎస్ఎన్ పురానికి చెందిన కృష్ణమూర్తి సీఆర్ఎస్‌లో రైల్వే ఉద్యోగిగా పనిచేసేవాడు. ఈ మేరకు రైల్వేలో ఉద్యోగాలు ఉన్నాయని, తాను ఇప్పిస్తానంటూ పలువురి నుంచి సుమారు రూ.2కోట్లు వసూలు చేశాడు. తర్వాత సమాధానం చెప్పకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. గతంలోనూ ఈ ఘనుడిపై గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదై ఉంది. ఈ క్రమంలోనే రెండు నెలలల క్రితం 12 మంది బాధితులు తమ వద్ద రూ.10లక్షల చొప్పున వసూలు చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే బుధవారం రైల్వేకోడూరుకు చెందిన కొందరు తమను కూడా కృష్ణమూర్తి మోసం చేసినట్లు రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఈ విధంగా ఎంతమంది సదరు కృష్ణమూర్తి చేతిలో మోసానికి గురయ్యారో తేలుస్తామని పోలీసులు వెల్లడిస్తున్నారు.

పరశురామేశ్వరుని సేవలో శ్రీరాములు


గుడిమల్లం ఆలయంలో శ్రీరాములు

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుని బుధవారం కర్ణాటక మాజీ మంత్రి శ్రీరాములు సేవించుకున్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, పాలక మండలి మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పోటీతత్వంతో ఉన్నత భవిత


విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న అశోకరాజు

నారాయణవనం:యువ ఇంజినీర్లు పోటీ తత్వం పెంపొందించుకుంటే ఉన్నత భవిష్యత్ పొందవచ్చని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు తెలిపారు. బుధవారం కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో జుబిలేషన్ డే నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం అశోక్‌రాజు మాట్లాడుతూ జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, కుటుంబ సభ్యులకు సమయం కేటాయించాలని సూచించారు. మంచి జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం ఆయనను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలోనే వివిధ క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జుబిలేషన్‌లో భాగంగా గురువారం చేపట్టే కార్యక్రమాలకు జేఎన్‌టీయూ అనంతపురం వీసీ సుదర్శనరావు, సినీనటి సంయుక్తా మీనన్, యాంకర్ భానుశ్రీ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


ఇస్మాయిల్ మృతదేహం

గూడూరురూరల్ : పట్టణంలోని బేల్దారి కాలనీకి చెందిన ఓ యువకుడు మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు.. బీహార్‌కు చెందిన ఇస్మాయిల్ (35) అనే యువకుడు బేల్దారి కాలనీలో నివసిస్తూ కూలీ పనులు వెళుతుండేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన శ్రీనివాసులు

చిల్లకూరు : కోట క్రాస్ రోడ్డు సమీపంలోని నెలబల్లిరెట్టపల్లెకు వెళ్లు మార్గం వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. గూడూరు రూరల్ మండలం పోటుపాళానికి చెందిన మోరా శ్రీనివాసులు(38) బైక్‌పై శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి వస్తుండగా అదుపు తప్పి హైవే అథారిటీ వారు ఏర్పాటు చేసిన ఎస్ఓఎస్ బాక్సును ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మరణించాడు. గూడూరు డీఎస్పీ గీతా కుమారి ఘటనాస్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది!

"ఊరంతా అప్పులు. ఒక్క దోపిడీ చేస్తే, వచ్చేదాంతో అప్పులన్నీ కొట్టేయచ్చు. చోరీల్లో ఆరితేరినవాళ్లను సాయం అడిగితే వచ్చేదాంట్లో వాటాలు అడుగుతారు. తలా రూ.2 వేలు ఇస్తే నా వద్ద పనిచేసేవాళ్లే వచ్చేస్తారు. ఇక అంతా సిద్ధం. పదండి లోపలకు.." అన్నాడు ముఠా నాయకుడు. డామిట్ అప్పుడే కథ అడ్డం తిరిగింది. భవన యజమాని ప్రతిఘటించాడు. స్థానికంగా ఉన్న యువకులు పిచ్చ కొట్టుడుకొట్టారు. ఒకరి కాలు విరిగింది. మరొకరికి మొహం మారిపోయింది. తీరా పోలీసుల రంగ ప్రవేశంతో ఉత్కంఠత నెలకొన్నా.. చివర్లో అందరూ ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు.

- ఒక్క దోపిడీతో.. అప్పులన్నీ కొట్టేద్దామనే ఆశ
- చిత్తూరులో రచ్చరచ్చ చేసిన కొత్త దొంగలు
- బొమ్మ తుపాకీలతో పట్టపగలు ఇంట్లో చోరీకి యత్నం
- ప్రతిఘటించిన యజమాని.. స్థానికులే హీరోలైన వైనం
- జిల్లా ఎస్పీ నుంచి.. ఆక్టోపస్ బలగాల పరుగులు
- కంటిమీద కునుకులేక.. ఆపై ఊపిరి తీసుకున్న ఖాకీలు



నిందితుల వద్ద లభించిన తుపాకులు, సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ


నిందితుల దాడిలో గాయపడ్డ భవన యజమాని చంద్రశేఖర్, ప్రధాన నిందితుడు సుబ్రమణ్యంరెడ్డిని బంధిస్తున్న స్థానికులు, నిందితులను పట్టుకున్న తరువాత మీడియాతో మాట్లాడుతున్న ఉమాపతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని గాంధీరోడ్డులో బుధవారం చోరీ యత్నం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి సంక్షిప్తంగా..

ఉదయం 6.28 గంటలు:

చిత్తూరు నగరంలోని గాంధీరోడ్డు-లక్ష్మీ థియేటర్ కూడలి వద్ద ఓ మారుతి ఓమ్నీ వ్యాను వచ్చి ఆగింది. అందులోంచి దిగిన ఆరుగురికి పైగా వ్యక్తులు ఎదురుగా ఉన్న 'పుష్ప షాపింగ్ కిడ్ వరల్డ్' దుకాణం పైన ఉన్న చంద్రశేఖర్ ఇంట్లోకి చొరబడ్డారు.

ఉదయం 6.35 గంటలు:

మొహానికి మాస్కులు, టోపీలు పెట్టుకున్న వ్యక్తులు చంద్రశేఖర్, అతని తల్లి సరస్వతి, భార్య శాంతి వైపు తుపాకులు చూపించి, బంధించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంట్లో ఉన్న డబ్బు, బంగారు నగలు బ్యాగులో వేయాలని చెబుతుండగా.. చంద్రశేఖర్ పెద్దగా కేకలు వేయడంతో పైఅంతస్తులో ఉన్న కుమారుడు లోకేష్, ఇతని భార్య మానస పరుగు పరుగున కింద అంతస్తులోకి వచ్చారు. వాళ్లకు తుపాకీ చూపి కింద కూర్చోపెట్టారు.

6.40 గంటలు:

చంద్రశేఖర్ ప్రతిఘటించడంతో తల, చేతికి గాయాలయ్యాయి. నిందితుల్లో ఒకరు బొమ్మ తుపాకీ పేలగా, అతి టప్ మంటూ శబ్దం చేసింది. వెంటనే తప్పించుకున్న లోకేష్ రోడ్డుపైకి వచ్చి సాయం కోసం అరవడం, చంద్రశేఖర్ మిద్దెపై నుంచే దొంగలు అని కేకలు వేశారు.

6.57 గంటలు:

స్థానికంగా టీ తాగడానికి వచ్చిన ఉమాపతి, అతని స్నేహితులు హుటాహుటిన దొంగలు ఉన్న భవనంలోకి ప్రవేశించారు. వీళ్లను చూసిన వెంటనే ఇద్దరు పారిపోయారు. ఇక ఉమాపతి గొంతుకు కత్తి పెట్టడంతో నిందితుడిని కాలితో తన్నాడు. కత్తి కిందపడడంతో స్థానికులంతా కలిసి నిందితులపై పిడిగుద్దుల వర్షం కురిపించారు. తాళ్ల సాయంతో నలుగురు నిందితులను కట్టేసి, పోలీసులకు సమాచారం అందించారు.

7.23 గంటలు:

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నలుగురు నిందితులను స్థానికులు, పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు తుపాకులతో ఇంట్లోనే ఉన్నట్లు చెప్పడంతో అలజడి మొదలైంది. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య తన సిబ్బందితో కలిసి మరో భవనం నుంచి చంద్రశేఖర్ ఇంట్లోకి ప్రవేశించారు. అందర్నీ బయటకు తీసుకొచ్చారు.

7.47 గంటలు:

ఎస్పీ మణికంఠ ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుల వద్ద ఆయుధాలున్నాయనే సమాచారం రావడంతో సాయుధ బలగాలను రప్పించారు. బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించి చేతుల్లో తుపాకులు పట్టుకున్న అధికారులు, సిబ్బంది భవనం లోపలకు వెళుతున్నారు, బయటకు వస్తున్నారు. కానీ ఏం జరుగుతోందో ఎవ్వరికీ అర్థం కావడంలేదు.

8.10 గంటలు:

నిందితులు వచ్చిన కారుకు తమిళనాడుకు చెందిన ద్విచక్రవాహన నంబర్ వేసుకోవడంతోపాటు, ప్రెస్ అని స్టిక్కర్ వేసుకోవడం, కారులో కత్తి, పెట్రోలు గుర్తించిన పోలీసులు దీన్ని చిన్న ఘటనగా భావించలేదు. విషయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు.

9 గంటలు:

తిరుమలలో ఉన్న ఆక్టోపస్ బలగాల సాయం తీసుకోవాలని డీజీపీ చెప్పడంతో.. ఎస్పీ మణికంఠ వారిని చిత్తూరుకు రప్పించారు.

9.30 గంటలు:


20 మందికి పైగా ఉన్న ఆక్టోపస్ బలగాలు ఘటనా స్థలం మొత్తాన్ని జల్లెడ పట్టాయి. చుట్టుపక్కల భవనాల్లో సైతం వెతికినా పారిపోయిన నిందితుల ఆచూకీ లభ్యం కాలేదు.

10 గంటలు:

పోలీసుల ఆపరేషన్ ముగిసింది. అందరూ వెనుతిరుగుతున్న సమయంలో....
ఘటన జరిగిన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్యాంకు ఉంది. దొంగలు బ్యాంకులో దాక్కున్నారా..? బ్యాంకును దోచుకోవడానికి వచ్చారా..? అనే ప్రశ్నలు తలెత్తడంతో మళ్లీ ఆక్టోపస్ బలగాలు బ్యాంకులోకి తుపాకులతో ప్రవేశించి, వెతికినా ఎవరూ కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకుని ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్లిపోయారు.

సీన్ కట్ చేస్తే..

చిత్తూరు నగరంలోని కలెక్టరేట్ భవనం వెనుక ఉన్న జీకే నగర్‌లో కాపురముంటున్న సుబ్రమణ్యంరెడ్డి 16 ఏళ్ల క్రితం కర్నూలు నుంచి వచ్చి ఇక్కడ సోఫాలు తయారు చేసి విక్రయిస్తున్నాడు. అందరికీ అప్పులు ఇచ్చి, ఆర్థికంగా నష్టపోవడంతో ఒక్క దోపిడీ చేసి అప్పులన్నీ సెటిల్ చేద్దామని ఇలా తొలి ప్రయత్నంగా చోరీకి ప్రయత్నించి చావుదెబ్బలు తిని.. కటకటాలపాలయ్యాడు. సుబ్రమణ్యంరెడ్డితోపాటు కర్నూలు, అనంతపురం జిల్లాకు చెందిన నవీన్, ఇబ్రహీమ్ బాషా, ప్రవీణ్, రామాంజనేయులు పోలీసులకు చిక్కగా.. రాజేష్‌తో పాటు మరో ఇద్దరు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. గురువారం ఈ ఘటనపై వివరాలను మీడియాకు వివరించే అవకాశం ఉంది.


భవనాన్ని చుట్టుముడుతున్న ఆక్టోపస్ బలగాలు

యువకుడి నేత్రదానం


దాత ప్రణీత్

సూళ్లూరుపేట : పట్టణంలోని సాయినగర్‌కు చెందిన బీరక ప్రణీత్ (21) మంగళవారం గుండెపోటుతో మృతి చెందగా, కుటుంబ సభ్యులు ఆ యువకుడి నేత్రాలను దానం చేశారు. బుధవారం స్థానిక ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు.

కొనసాగుతున్న విచారణ

తిరుపతి అర్బన్ : తిరుమలలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీ సమయంలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై జ్యుడీషియల్ విచారణ కొనసాగుతోంది. జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి నేతృత్వంలో విచారణ జరుగుతోంది. తిరుపతి కలెక్టరేట్‌లో కమిషన్‌కు కేటాయించిన చాంబర్ నుంచి ఇప్పటికే ఈ ఘటనలో గాయపడిన భక్తులను విచారించారు. ఈ క్రమంలోనే భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చేపట్టాల్సిన భద్రతా అంశాలపై ప్రభుత్వం నివేదిక కోరడంతో కమిషన్ ఆ దిశగా సైతం పరిశీలన చేపట్టింది. అందులో భాగంగా ఈ నెల 15,16 తేదీల్లో తిరుమలలో క్యూలను తనిఖీ చేయనుంది. అలాగే 17,18 తేదీల్లో టీటీడీ ఈఓ శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజును విచారించనుంది. అనంతరం 19,20 తేదీల్లో తొక్కిసలాట సమయంలో విధులు నిర్వర్తించిన ఉద్యోగుల విచారణ చేపట్టనుంది.

వాగులో మునిగి విద్యార్థి మృతి


మృతి చెందిన వివేక్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం మామండూరులో వాగులో మునిగిపోయి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. అనంతపురం జిల్లాకు చెందిన వివేక్(21) రేణిగుంట మండలంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం కాలేజీకి సెలవు ఇవ్వడంతో ఐదుగురు స్నేహితులతో కలిసి మామండూరు పర్యాటక కేంద్రానికి చేరుకున్నాడు. అక్కడి నీటి వాగులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. స్నేహితులు వెంటనే వెలికి తీసి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం

తిరుపతి రూరల్, (రామచంద్రాపురం): రామచంద్రాపురం మండలం రాయలచెరువు కట్టపై చేపల మార్కెట్ షెల్టర్ దగ్గరలోని ముళ్ల చెట్ల వద్ద గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామాంజనేయులు ఘటనాస్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. మృతురాలి ఒంటిపై పచ్చరంగు చీర, ఎరుపు జాకెట్ ఉందని వెల్లడించారు. ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని వివరించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9440796731 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.